# సత్యవతి: ఎయిత్ క్లాస్

— రవి కొలికపూడి

"దెయ్యాలున్నాయంటే మీరు నమ్ముతారా?" వంతెన మీద కూర్చుని చెరువులోకి రాళ్ళేస్తూ అన్న సత్యవతి వేపు చూసి నవ్వి "నమ్మతారా ఏమిటి... పక్కనే ప్రత్యక్షంగా కనిపిస్తుంటే" అని అన్నాను.

సత్యవతి కోటేరు ముక్కు ఎగసిపడి, పై పెదవిని కొంచెం పైకి లేపి నవ్వింది. పల్లెటూళ్ళో ఎనిమిదో తరగతి వరకు చదివి పట్నం వెళ్ళి చదివేందుకు ధైర్యం చాలక అక్కడితో ఆపేసి ఇంట్లో కూర్చున్న సత్యవతి అంతటి ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినందుకు పొలిటిక్స్ లెక్చరర్‌నయిన నాకు గొప్ప ఆశ్చర్యమేసింది.

"మానాన్న నిన్న మీ గూర్చి అడిగాడు" కాళ్ళూపుతూ అందామె. ఆమె అలా కాళ్ళూపుతుంటే ఎదురుగా నిలబడిన నాకు ఆమె పాదాలు తగుల్తున్నాయి. ఓ క్షణం సత్యవతి కాళ్ళవేపు, ఆమె ముఖం వైపు చూశాను.

ప్చ్... లాభం లేదు. అసలు పట్టించుకునే మూడ్‌లో లేదు.

అసలునిజానికి సత్యవతే నాకొలీగ్ అయి వుండి ఇద్దరం ప్రేమించుకుంటుంటే ఆమె కాళ్ళతో నన్ను ముఖం మీద పెట్టి కొట్టినా 'చిలిపి' అనుకుని సర్దుకుపోయేవాణ్ణేమో. ఇప్పుడు సత్యవతిని గాఢంగానే ప్రేమిస్తున్నాను. కానీ అట్టడుగున దాగి వున్న నా 'ఇగో' కొంచెంగా బయటపడి అలా చూసానంతే. కానీ — ఈ ఇగోల సంగతి అమాయకురాలయిన సత్యవతికి తెలియవు కనుకనే ఓణీ స్థానభ్రంశం చెందినా పట్టించుకోకుండా కాళ్ళూపుతూ మాట్లాడుతున్న ఆమెని అలా అర్థం చేసుకున్నందుకు నన్ను నేను తిట్టుకొని, వెంటనే సర్దుకున్నాను.

"ఏమని అడిగారూ?" అన్నాను జేబులోంచి సిగరెట్ తీసి వెలిగిస్తూ—

"పట్నంలో కొలువు చేస్తూ ఈ పల్లెల్లో ఎందుకున్నాడో ఆ పంతులు అన్నాడు" అంది నవ్వుతూ.

"నువ్వేమన్నావ్?"

"ఏమో... నాకేం తెలుసు. బహుశా అద్దెలు తక్కువ అయి వుండొచ్చు అన్నాను" అంటూ ఓణీని భుజాల నిండుగా కప్పుకుని నిలబడింది సత్యవతి. నేను వెనక్కు తిరిగి చూశాను. దూరం నుండి ఇద్దరు స్త్రీలు గడ్డిమోపు నెత్తిన పెట్టుకుని ఇటే వస్తున్నారు.

"ఎవరు వాళ్ళు"

"ఏమో"

"మరెందుకు కంగారుపడుతున్నావ్?" అన్నాను.

"కంగారా? కంగారెందుకు? మాంసం తింటున్నామని మెళ్ళో దండేసుకోనక్కర్లేదు కదా. అందుకనే నిలబడ్డాను" అందామె స్వచ్ఛంగా. నాకు ముచ్చటేసింది.

"మీరు మీ ఇంటికెప్పుడెళ్తున్నారూ?" అంటూ నడక ప్రారంభించింది.

"ఏమిటీ అప్పుడే వెళ్ళిపోదామా?" అన్నాను.

నవ్వి "అన్న పొలం నుండి వస్తాడు. వదిన కూడా లేదు. వెళ్ళాలి" అంది సత్యవతి.

"ఈ శనివారం వెళ్ళి మంగళవారం వస్తాను. నీ విషయం ఈ వారం చెప్పేస్తాను సత్యవతీ. నువ్వూ మీ ఇంట్లో చెప్పేయ్. నన్ను మీ వాళ్ళు కాదనక పోవచ్చేమో. కానీ మా వాళ్ళదే సమస్య..." నోరు జారాను.

ఛివాల్న నావైపు తలతిప్పి చూసింది.

"నా ఉద్దేశ్యం అది కాదు సత్యవతీ" అంటూ నవ్వాను.

"మీరు నిజమే చెప్పారు. అవును మరి ఎనిమిదో తరగతి చదువుకొని వ్యవసాయం చేసుకుని బ్రతికే మా కుటుంబంపై మీ వంటి వారికి చిన్నచూపుఉండటం సహజమే."

మౌనంగా నడుస్తున్నాం. సత్యవతిలో గొప్ప సుగుణం ఉంది. చదివింది తక్కువే అయినా ఎదుటి వారిని అద్భుతంగా అర్థం చేసుకుంటుంది.

"మాట్లాడు సత్యవతీ."

"మీ వాళ్ళను ఎలాగయినా ఒప్పించండి గోపీగారూ. ప్లీజ్. మీరు నా పక్కనుంటే చాలు. ఎంత గర్వంగా వుంటుందో నాకు. మీరు మంచివారే. ఇంతటి మంచి కొడుకుని కన్న తల్లిదండ్రులు కూడా తప్పకుండా మంచి వారయి వుంటారు. వస్తానండీ" అంటూ వేగంగా వెళ్ళిపోతున్న సత్యవతి వైపు చూస్తుండిపోయాను.

వెనుక నుండి వస్తున్న ఇద్దరాడవాళ్ళు నన్ను దాటేస్తూ ఓసారి నావైపు చూసి వెళ్ళిపోయారు. మనసంతా ఖాళీ అయిన ఫీలింగ్. సిగరెట్ వెలిగించి కాసేపు ఒంటరిగా వంతెనపై కూర్చున్నాను. పిచ్చి సత్యవతీ— నావాళ్ళు మంచివాళ్ళయితే ఇలా మీ పల్లెటూళ్ళో ఎందుకుంటాననుకున్నావ్. వాళ్ళ మంచితనాన్ని డబ్బుతో కొలుస్తారని నీకు చెప్పినా నమ్మవు.

చికాగ్గా అనిపించింది. రూంకి బయలుదేరాను. నేనుండేది ఆ ఊరి ప్రెసిడెంట్‌గారింట్లో. రెండు వందల యాభై రూపాయలకి విశాలమైన పోర్షన్ ఇచ్చారాయన. ఆ పట్నంలోని కాలేజికి స్కూటర్‌పై వెళ్ళడానికి పదినిమిషాలు పడుతుందంతే.

ఆకలేస్తున్నా తినబుద్ధి కావట్లేదు.

ఎటునుంచి ఆలోచించినా సత్యవతిని తమ కోడలిగా అంగీకరించరు. అమ్మనయినా ఒప్పించవచ్చేమో కానీ నాన్నని ఒప్పించడం చాలా కష్టం. కట్నం వస్తుంది కదాని ఇప్పటికే పాతికవేలు అప్పుచేశాడాయన.

సత్యవతి గూర్చి చెప్పగానే గుండె జబ్బు మనిషయిన అమ్మ రియాక్షన్ ఎలా ఉంటుందో.

ఇంకా ఒకందుకు తను అదృష్టవంతుడు. చెల్లెళ్ళు, అక్కలు లేరు. లేకపోతే సమస్య మరీ జటిలమయ్యేదే.

"బాబాయ్... అమ్మ పిలుస్తోంది" ప్రెసిడెంట్‌గారి మనుమరాలు వచ్చి చెప్పగానే నవ్వుతూ స్లిప్పర్స్ వేసుకుని బయటికి నడిచాను.

ఈ పల్లెటూరికి ఇంకా అంకుల్, ఆంటీ సంస్కృతి పాకినట్లు లేదు. హాయిగా మావయ్యా, బాబాయ్ అంటూ స్వచ్ఛంగానే ఉన్నారు అనుకుంటూ వారి వరండాలో వేసిన సోఫాలో కూర్చున్నాను.

"గోపీ— మీ అన్నయ్య పట్నం వెళ్ళి ఇంకా రాలేదు. చంటాడిని కాస్త హాస్పిటల్‌కి తీసుకెళ్దాం. తోడు వస్తావా?" అన్న ప్రెసిడెంట్ కూతురు మాలతి వైపు చూశాను.

నాకన్నా రెండేళ్ళు పెద్దదై యుంటుందామె. కృత్రిమత్వం, కలుషితం లేని ఆప్యాయత వీరిది. సరేనంటూ స్కూటర్ తీసుకు రావడానికి లేచాను. ఇంతలోనే ప్రెసిడెంట్ అల్లుడు, మాలతి మొగుడు వచ్చి నావేపు చిరాగ్గా చూసి లోపలికెళ్ళిపోయాడు.

నాకు వీడంటే మహా చిరాకు. అనుమానపు వెధవ. ఇన్‌ఫీరియారిటీతో కుళ్ళుకుఛస్తూ ఉంటాడెప్పుడూ. ఇలా అయిన దానికీ కానిదానికీ కుచించుకుపోయే వాళ్ళంటే పరమసహ్యం నాకు. అందుకే నా రూంలోకి వచ్చేశాను. మళ్ళీ నాకోసం మాలతి కబురు చేయదని తెలుసు నాకు.

స్టీరియో ఆన్ చేయబోయి ఆ ప్రయత్నం మానుకున్నాను. తమిళ, కొంకిణీ భాష పాట వింటున్నా.

సరే— పిల్లలంతా కిటికీల్లోంచీ, గుమ్మాల్లోంచి చూస్తూ కేసెట్ అయిందాకా నిలబడతారు.

నాకు వారిని చూస్తే నవ్వొస్తుంది. కోపం వస్తుంది. జాలేస్తుంది.

ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. సినిమాకి వెళ్దామన్నా టౌన్‌కెళ్ళాలి. అంత ఓపిక లేదు.

పోనీ. సత్యవతి ఇంటికెళ్తే.

నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది.

గ్యాస్ ఆన్‌చేసి టీ వెచ్చచేసుకున్నాను. తాగుదామని కప్‌లు చూస్తే అవి కడిగిలేవు. కడగాలంటే బద్ధకం.

అంతే— మంచంమీద వాలిపోయాను.

ఇప్పుడు సత్యవతి నా కళ్ళకు పర్వతంలా కనిపిస్తుంది.

పరమాణువు చేసి చెప్పడం ఎలానో అర్థం కావడం లేదు.

ఒకవేళ చెప్పా పెట్టకుండా సత్యవతిని లేపుకెళ్తే.

కాలేజీలో టీజింగ్‌ని భరించడం కష్టం.

గ్రాడ్యుయేట్ అని అబద్ధం చెప్తే—

నో... మా బాబుది క్లరికల్ ఇంగ్లీషుతో ఎదుటివాణ్ణి పీల్చిపిప్పిచేసే మనస్తత్వం. ఆ అస్త్రం సత్యవతిపై సంధించాడంటే అవుట్.

లాభం లేదు. రేపు సత్యవతికి కూడా చెప్పకుండా ఊరెళ్ళిపోయి చెప్పేయాలి. ఏమైనా సరే సత్యవతి నా భార్య కావాలి. దట్సిట్.

లైట్ ఆఫ్ చేసి కళ్ళు మూసుకున్నాను.

* * * *



"నిన్నింత కష్టపడి చదివించింది వెధవ పనులు చేయడానికి కాదు గాఁవోయ్" కళ్ళజోడు కిందకు జార్చి చూపుల్ని పైన నిలిపి చెప్తున్న నాన్న వైపు ఒకసారి చూసి తలదించుకున్నాను.

"చదువు లేకపోతే పోయింది. ఆస్తికూడా లేదటగా గోపీ. దొందు దొందే అయితే ఎలారా" అమ్మ గంట ఏడ్చి తర్వాత మాట్లాడిన మొదటి మాట ఇది.

నేనేం మాట్లాడలేదు.

పెద్దమనిషిగా తీసుకొచ్చిన మా పక్కింటి జగన్నాధరావుగారి చొరవతో అమ్మానాన్నల్ని ఒప్పించాడు.

అసలు నేను ఇంపాసిబుల్ అనుకున్నది ఇంత ఈజీగా అయినందుకు నమ్మకం కుదరట్లేదు.

"నాన్నా... ఆ అమ్మాయికి చదువు లేకపోవచ్చు...."

నా మాటల్ని మధ్యలో తుంచేసి— "నాకు వివరాలు చెప్పక్కర్లేదు. నెలకు మూడు వేలు సంపాదించుకుంటున్నావ్. అదే నీ ఆదాయం. ఆస్తి, నా ఆస్తిలో చిల్లిగవ్వ రాదు. అంతా పెద్దాడి పేరనే రాస్తాను. వెళ్ళిపో." అంటూ బయటకెళ్ళిపోయాడు నాన్న. అమ్మ గదిలోకి వెళ్ళిపోయింది.

అన్న, వదిన, పిల్లలు మాత్రం నావైపు సానుభూతిగా చూస్తున్నారు.

ఇవన్నీ నన్ను బాధపెట్టిన మాట నిజమే కానీ— సత్యవతిని అంగీకరించినందుకు నాకు కలిగిన సంతోషంలో ఈ బాధ ఏమాత్రం.

ఊరు ప్రయాణమయ్యాను.

* * * *

"ఈ వారం రోజుల నుండీ ఎందుకు రాలేదు?" చాలా సహజంగా అడిగిన సత్యవతిని నిశితంగా చూశాను.

నేను ఊహించింది వేరు. అలిగి నన్ను నానా తిప్పలు పెడుతుందేమోననుకున్నాను.

"ఇంటికెళ్ళాను" అంటూ ఆమెకళ్ళల్లోకి చూశాను.

"అలాగా. అందరూ బాగున్నారా?" ఓ అర్థం లేని నవ్వు.

"నటిస్తున్నావా?" సీరియస్‌గా అన్నాను. నాకు ఈ డొంకతిరుగుళ్ళంటే పిచ్చి కోపం.

"నటించడం దేనికీ" అదే నవ్వు.

"మన పెళ్ళికి ఒప్పుకున్నారు సత్యవతీ."

ప్చ్... లాభం లేదు. షిట్... నా ఉత్సాహాన్నంతా నీరుగార్చేసింది. కాలేజికిరోజు హాలిడే అన్నంత క్యాజువల్‌గా ఈ విషయం చెప్పాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు.

"మా ఇంట్లో ఒప్పుకోలేదు."

"ఎందుకని."

"ఏమో."

నా సహనానికి కౌంట్ డౌన్ స్టార్టయింది.

"ఏమో ఏంటీ. కారణం లేదా?" కొంచెం గొంతు పెంచాను.

"వాళ్ళు చెప్పిన కారణం మీకు చెప్తే బాధ పడతారు."

"పడన్లే. చెప్పు". సిగరెట్ తీసి వెలిగించాను.

"మూడువేలు ఏం సరిపోతాయి? గట్టిగా ఓసారి ప్రసవానికి సరిపోవు. ముసలోడయిందాకా ఆ గొర్రెతోక జీతం రాళ్ళేగా" అని అన్న, నాన్న అన్నారు" ఆమె ఏడవడం లేదు.

కనీసం కించిత్ బాధ లేదామెలో.

"పదివేలు సంపాదించే వాడొస్తాడటనా" ఉక్రోషంగా అన్నాను.

"ఏమో... మల్లెతోటలున్నాయట ఎవరికో. సంబంధం ఖాయం చేసుకెళ్ళారు." గోళ్ళకున్న ముదురు ఎర్రరంగు చౌకబారు నెయిల్ పాలిష్‌ని చూసుకుంటూ చెప్పింది సత్యవతి. ○